# ★ మెలికల మలుపు ★

— బి. పి. కరుణాకర్

రిక్షా వేగం హెచ్చింది. రోడ్ వెనక్కి పారిపోసాగింది. ఎలక్ట్రిక్ లైట్ల వెలుగు నీడలు విచిత్రంగా మారుతున్నాయి. రిక్షా మలుపు తిరిగి కాలేజీరోడ్ ఎక్కింది.

రిక్షాలో కూర్చున్న శ్రీను ప్రక్కకు ఒత్తిగిలి కూర్చుని సిగరెట్ వెలిగించాడు ఏదో గుర్తుకు వచ్చినట్లు "రాంమూర్తి! మీతమ్ముడు కాళి ఏం చేస్తున్నాడు?' అడిగాడు.

రాంమూర్తి ఉలిక్కిపడ్డట్టు శ్రీనుముఖంలోకి చూశాడు.

'విజయవాడలో ఉంటున్నాడో, మరెక్కడ వుంటున్నాడో తెలియదు' అన్నాడు రాంమూర్తి.

శ్రీను విచిత్రంగా నవ్వి, 'భలేవాడివి మీ తమ్ముడు ఎక్కడ వుంటున్నాడో తెలియదు. సరే ఎం చేస్తున్నాడో అదికూడా తెలియదా?' అన్నాడు.

'ఊహుఁ'

శ్రీను మళ్ళీ విచిత్రంగా నవ్వాడు.

రాంమూర్తి శ్రీను ముఖంలోకి పరీక్షగా చూశాడు.

'కానీ శ్రీనూ, మా కాళి నెల నెలా అరవై మాకు పంపిస్తూ వుంటాడు. ఎడ్రస్ ఏమో కేరాఫ్ పోస్ట్ మాస్టర్ ఉంటుంది.'

శ్రీను ఈసారి నవ్వలేదు.

'మీ కాళి భలేవాడోయ్! ఎవ్వరకూ అర్థకాడు' అన్నాడు చిన్నగా నిట్టూరుస్తూ.

రాంమూర్తి ఏమి మాట్లాడలేదు.

రిక్షా ముందుకు పోతుంది.

రోడ్ వెనక్కి పరుగెడుతోంది.

'ఏం నాయనా! ఇంత త్వరగా వచ్చావ్! నీ కోసం కాచు కూచోడానికి ఇదేం సత్రం కాదు నాయనా' వదిన తాటాకారుమాటలు విని కాళిదాసు గడపలో ఆగిపోయాడు.

'ఈ రోజు ఆలస్యమైంది వదినా.'

'ఎందుకు నాయనా ఆలస్యం? ఉద్యోగం వెలగబెడుతున్నావుగా. తీరిక ఎక్కడ వుంటుంది మరి' వదిన కంఠంలో వ్యంగ్యం ధ్వనిస్తుంది.

ఆ రోజు ఎప్పటిమాదిరి తనలో తను నవ్వుకోలేకపోయాడు కాళిదాసు వదినగొంతు నేపధ్యంలో అసంపర్కమైన శ్రుతిలో సంగీతంలా మ్రోగుతూనే ఉంది

'ఏముందీ పనీ పాటలులేని అడ్డగాడిద లంతా యిలా తగులబడి, మడతనలక్కుండా మల్లెపూల్లాటి యిస్త్రీ దుస్తులు వేసుకుని రోడ్లమ్మట తిరిగితే సరిగావును...'

కాళి చెవుల్లో ఈ సంగీతం మారుమ్రోగుతూనే వుంది

'ఏముందీ చదవడానికేం చదువుతారు చదివించేవాళ్ళు వుంటే, తీరా చదివాక ఉద్యోగం అదీ ? ? చూసుకోకుండా... కూడుపెట్టే వాళ్ళుంటే సరి రోడ్లన్నీ తమవైనట్టు తిరుగుతారు...'

కాళిదాసు గుడ్డలు మార్చుకుని ఆరోజు పేపర్ తీశాడు. కాళిదాసు కళ్ళు పేపర్లోకి చూస్తూనే వున్నాయి. అచ్చు పంక్తుల మధ్య తెల్లకాగితం కాళిదాసు ఆలోచనల్లోకి పాకిపోయింది. పొంగిన పాలలా లోపలంతా ఆవరించింది

దినపత్రిక మడిచాడు. ఆ తెల్లని ఆందోళన భరించలేక కళ్ళుమూసుకున్నాడు మూసిన కళ్ళతో సగం తెరిచిన నోటితో ఆ పెదవుల నడుమ మెరిసే బియ్యపు గింజల్లాటి పళ్ళతో నిశ్శబ్దంగా నవ్వాడు. ఒక్కక్షణం చిరునవ్వు సమాధిలో ఉండి చటుక్కున లేచాడు. బైటకు వచ్చాడు.

'ఎక్కడికి నాయనా వెళ్తున్నావ్?' దీర్ఘం తీసింది వదిన.

'ఇప్పుడే వస్తాను వదినా'

'ఛీ! ఛీ! పాడుకొంప- భోజనంవద్దా?'

'వద్దు వదినా. ఆకలిగాలేదు.'

ప్రతిదినంచి ఈ ధోరణి దీర్ఘానసాగి రాగాన పడడం పరిపాటి. వదిన గొంతుకలోనూ కళ్ళల్లోనూ, ముక్కులోనూ అసూచనలు కనబడగానే కాళిదాసు యింట్లోంచి వెళ్ళిపోతాడు. రాంమూర్తి తను వున్నా లేను అనుకుంటాడు.

కాళిదాసు నవ్వడం ఆమెకు ఇష్టంలేదు కాళిదాసుతో తన పిల్లలుండడం ఆమె యిష్టపడదు. అతన్ని ఎవరో దొంగను చూసినట్లు చూస్తుంది. అతను నవ్వుతూ చలాకీగా ఉన్నప్పుడు ఆవిడ రక్తం ఏదో తెలియని ఆవేశంతో వేడెక్కిపోతుంది. ఆవిడ ఎన్నిమాటలు అన్నా, తిట్టినా కాళిదాసు పట్టించుకోడు. అప్పుడావిడకోపం రాంమూర్తిమీదా, పిల్లల మీదా ఉవ్వెత్తుగా తిరుగుతుంది.

కాని ఆ రోజు కాళిదాసు కళ్ళు ఎదురుగా వున్న వస్తువులను గుర్తుపట్టలేదు; ఎక్కడో చూస్తున్నాయి. వదినవచ్చి భోజనానికి లెమ్మంది. కాళిదాసు లేచాడు. కొంచెం తటపటాయించాడు.

'నాకివాళ ఆకలిగా లేదు వదినా' అని కూర్చున్నాడు.

'ఎందుకు?'

'ఒంట్లో ఏమీ బాగోలేదు.'

'ఒంట్లో బాగా లేకపోతే అడ్డగాడిదలా రోడ్లమ్మట లింగు లింగుమని తిరగడం మానెయ్యరాదా నాయనా.' అంది వదిన.

కాని కాళిదాసు సాయంత్రం బైటకు వెళ్ళాడు. వెళ్తూ వెళ్తూ కాలేజీ స్పోర్ట్సులో తనకు వచ్చిన సిల్వర్ మెడల్ను తనతో తీసుకు వెళ్ళాడు తిరిగి వచ్చేప్పుడు అదిలేదు. అన్న పిల్లలకు చాక్లెట్లు కొనుక్కువచ్చాడు

రాంమూర్తి తమ్ముడిని తల్లీ తండ్రి పోయినప్పటినుంచి పెంచాడే కాని తమ్ముడ్ని ఎలా చూడాలో తెలియదు; సముదాయించడం తెలియదు, కాళిదాసులో ఏదో మార్పు వచ్చిందని అతడికి తెలుసు, కాని కాళిదాసు గుచ్చి గుచ్చి అడిగేంత చనువులేదు. కాళిదాసు మనసులో ఎన్నో లోటులున్నా సునీ, అలోతుల్నీ, తరచి నిజాన్ని గ్రహించడం

అసాధ్యమనీ రామమూర్తికి తెలుసు తాయారుకు కాళిదాసంటే అసహ్యం వాడు పరాయి వాడయినట్టు చూస్తుంది రెండో ప్రక్క కాళి అంటే ఒక అవ్యక్తమైన భయం ఆమెను మరదికి దూరం చేశాయి.

తెల్లవారింది, కాళిదాసు లేడు. ఎటో వెళ్ళిపోయాడు బల్లమీద ఒక ఉత్తరం కని పించింది చదివాడు 'అన్నయ్యా! క్షమిం చండి' అని వుంది. కాని తాయారుకు ఆమె స్త్రీ హృదయంలో ఎక్కడో అసలు నిజం. కాళి ఎందుకు వెళ్ళిపోయాడో తెలుసు కానీ అలా జరుగుతుందని నీకు తెలుసునని రామ మూర్తి ఆత్మ ఘోషించింది.

రామమూర్తి హృదయం అప్పటి సంగతు లతో వొణికింది.

శ్రీను సిగరెట్ పైటకు విసిరాడు. రామ మూర్తి ముఖంలోకి చూశాడు.

'ఏమిటి ఆలోచిస్తున్నావ్?' శ్రీను అడి గాడు.

'మా కాళి గురించి'

రిక్షా మరో మలుపు తిరిగి హోటల్ ముందు ఆగింది.

'మీ కాళి అభిమానవంతుడోయ్' అన్నాడు శ్రీను రిక్షా దిగుతూ.

'అవునవును' గొణుక్కున్నాడు రామమూర్తి

రిక్షావాడు మాట్లాడలేదు. తల అడ్డంగా వూపాడు

'రూమ్‌లోకి వెళ్ళి చిల్లర తీసుకువస్తాను' ఇక్కడే వుండు.

రామమూర్తి రూమ్‌నుంచి తిరిగి వచ్చేసరికి రిక్షా లేదు

'ఏయ్ రిక్షా!'

పెద్దగా కేకవేశాడు రామమూర్తి

రిక్షా మాట్లాడలేదు.

రిక్షా త్రొక్కుతున్న కాళిదాసూ మాట్లాడ లేదు.

---

## జాగృతి దీపావళి కథానికల పోటీలు

ప్రతి యేడాదివలెనే ఈ యేడు కూడా జాగృతి దీపావళి కథానికల పోటీలను నిర్వహిస్తోంది. మొత్తం రు 150 లు బహుమతులు. రెండు సాంఘికాలు (రు 50, రు 50 లు), ఒక పౌరాణికం (రు 25 లు) సాంఘి కులలో ఒక బహుమతి అవినీతిపై కథానికకు. కథలు చేరడానికి ఆఖరు తేదీ 30-9-64 గెలుపొందిన కథాని కలు దీపావళి సంచికలో ప్రకటింప బడుతాయి. దేశభక్తి గీతాల పోటీ కూడా ఉంది. వివరాలకు "సంపాద కులు, జాగృతి, పో. బా. నెం. 363, విజయవాడ – 2" కు వ్రాయవచ్చు


బొంబాయినుండి వెలువడు తోంది!

ఆ బాల గోపాలానికి ఆనందా న్నందించే విధంగా,

ప్రతి శీర్షిక లోను ప్రత్యేకత చూపిస్తూ —

క్రొం గ్రొత్త సంస్కారంతో — ప్రతి నెలా 1,16 తేదీల లో

## జాతీయ సంస్కృతి

(సచిత్ర పక్ష పత్రిక)

వ్యవస్థాపకులు : శ్రీ సి. కనకాంబరరాజు.

—రసవత్తరమైన కథలు, పద్యాలు, గేయాలు, నాటికలు, వ్యాసాలు, ప్రవాసాంధ్ర వార్తా విశేషాలు, ప్రశ్నోత్తరాలు, హ్యూమర్, సెటైర్—ఇంకా ఎన్నెన్నో!!!

సాలుచందా 6 రూపాయిలు, విడి ప్రతి 25 న. పైసలు.

ఔత్సాహికులైన రచయితల ప్రముఖ రచనలకు మా పత్రిక ద్వారా ప్రోత్సాహం తప్పక లభిస్తుంది!

ఏజెంట్లు ఏజెన్సీ వివరాలకై సంప్రదించండి.

ఎడిటర్ : పి. నాగేశ్వరరావు
8, Chimna Bhuvan,
Bhimani Road,
Matunga, BOMBAY - 19